సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 25 । జూలై । 2023



మిడ్‌మానేరుకు వరద

బోయినపల్లి: మిడ్‌మానేరులోకి సోమవారం మూలవాగు నుంచి 2,500 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి 1,530 క్యూసెక్కులు వెళ్తోంది.



పదోన్నతితో గుర్తింపు

సిరిసిల్లక్రైం: పదోన్నతితోనే గుర్తింపు అని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. కోర్టు విధుల్లో ఎస్సైగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు సీఐగా పదోన్నతి రావడంతో అభినందించారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'ఎస్సైని సస్పెండ్ చేయాలి'



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న దళితసంఘాల నాయకులు

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని పొత్తూరుకు చెందిన ర్యాగటి అజయ్, తోడేటి అజయ్‌లను చిత్రహింసలకు గురిచేసి, కొట్టిన ఎస్సై రాజేశ్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు సోమవారం ఇల్లంతకుంటలో ధర్నా చేపట్టారు. తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. దళిత బహుజన సంఘాల ఐక్యవేదిక మండల ఇన్‌చార్జి సావనపెల్లి రాకేశ్ మాట్లాడుతూ దళిత ఎస్సైని బదిలీ చేసి చేతులు దులుపుకోకుండా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇల్లంతకుంటకు ముప్పై పడకల ఆస్పత్రి

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలానికి ముప్పై పడకల ఆస్పత్రి మంజూరైంది. ఈమేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. రూ.9కోట్లతో ఆస్పత్రి భవనాన్ని నిర్మించనున్నట్లు పేర్కొంది. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇక్కడి ప్రజల అవసరాల రీత్యా ముప్పై పడకల ఆస్పత్రి అవసరమని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని వారు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా మంజూరు చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ఆస్పత్రి మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, ఇందుకు కృషి చేసిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ కోరారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 1న నిర్వహించే 'చలో హైదరాబాద్' కోసం సిరిసిల్లలో సోమవారం భిక్షాటన చేపట్టారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి, విద్యాశాఖలోని అన్ని పోస్టుల భర్తీ, హాస్టళ్లకు సొంత భవనాల హామీలు అమలు చేయాలని కోరారు. రూ.5,300 కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సామనపల్లి ప్రశాంత్, రాజు, ప్రకాశ్‌నాయక్, మధు, శ్యామ్, మనోజ్, రాము, సంజయ్ పాల్గొన్నారు.

28న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

వేములవాడఅర్బన్: అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లకు ఈనెల 28న స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాలిసెట్‌లో అర్హత పొంది, పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి 27వ తేదీ సాయంత్రం 4గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ.6,210 ఫీజుతో ఈనెల 28న ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్ కోసం కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు అధ్వాన్నంగా మారాయని, మూడు కిలోమీటర్లు డబుల్‌రోడ్డుగా మార్చాలని కోరారు. గణేష్, పెద్దూర పర్శరాములుగౌడ్, అనిల్, భాస్కర్, రాజుగౌడ్, బట్టు ప్రవీణ్, ఆంజనేయులు, రాము పాల్గొన్నారు.

వర్షం దంచికొట్టింది

సిరిసిల్ల: జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరక వర్షం దంచికొట్టింది. అత్యధికంగా వేములవాడలో 54.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా గంభీరావుపేటలో 6.5 మిల్లీమీటర్ల వాన పడింది. రుద్రంగిలో 43.7, చందుర్తిలో 50.0, వేములవాడ రూరల్‌లో 23.1, బోయినపల్లిలో 27.1, సిరిసిల్లలో 22.5, కోనరావుపేటలో 35.8, వీర్నపల్లిలో 20.3, ఎల్లారెడ్డిపేటలో 12.8, ముస్తాబాద్‌లో 11.4, తంగళ్లపల్లిలో 20.2, ఇల్లంతకుంటలో 23.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

సంక్షోభ హాస్టళ్లు



ఇది సిరిసిల్లలోని కోర్టు సమీపంలో గల బీసీ హాస్టల్. ఇక్కడ కిటికీలకు దోమలు అడ్డుగా అద్దాలు లేవు. దీంతో దోమలు గదిలోకి వస్తుండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా గాలి, వెలుతురు వచ్చే ఏర్పాట్లు కూడా లేవు.



సిరిసిల్లలో నిర్వహిస్తున్న చందుర్తి ప్రీమెట్రిక్ హాస్టల్

- అద్దె భవనాలు.. అరకొర వసతులు
- దోమతెరలు లేని కిటికీలు
- బిక్కుబిక్కుమంటున్న చిన్నారులు
- స్థానికంగా ఉండని వార్డెన్లు
- శాశ్వత భవనాల నిర్మాణంపై పట్టింపు కరువు

సిరిసిల్లకల్చరల్: హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. కనీస వసతులు కరువై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాలు.. అరకొర వసతుల మధ్య కాలం వెల్లదీస్తున్నారు. పెచ్చులూడిన స్లాబులు.. పగుళ్లుబారిన గోడలు.. దోమతెరలు లేని కిటికీలతో అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ పరిధిలో 9 హాస్టళ్లు నడుస్తున్నాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు గొల్లపల్లి, వేములవాడ, చందుర్తి, గాలిపెల్లిల్లో హాస్టళ్లు ఉన్నాయి. వార్డెన్ పనితీరు సరిగ్గా లేకపోవడంతో చందుర్తి హాస్టల్‌లో పిల్లల సంఖ్య తగ్గిపోయింది. దీంతో ఇటీవల ఆ హాస్టల్‌ను సిరిసిల్లలోని కోర్టు సమీపంలోని అద్దె భవనంలోకి తరలించారు. ఈ వార్డెన్‌కు ఇల్లంతకుంట గాలిపెల్లి హాస్టల్ బాధ్యతలు సైతం అప్పగించారు. దాదాపు అన్ని వసతిగృహాలలో సమస్యలే రాజ్యమేలుతున్నాయి.

పేరుకుపోయిన అద్దె బకాయిలు

- వేములవాడలోని ఓ హాస్టల్ అద్దె దాదాపు రూ.75 లక్షల వరకు బకాయి ఉన్నట్లు తెలిసింది. ఈ భవనం అద్దె నెలకు రూ.75వేలు.
- సిరిసిల్లలోని కోర్టు సమీపంలోని ప్రీమెట్రిక్ హాస్టల్ భవనం అద్దె దాదాపు 16 నెలలుగా పెండింగ్‌లోనే ఉంది.
- సిరిసిల్లలోని కొత్తబస్టాండ్‌లో సమీపంలో ఉన్న మరో హాస్టల్ బిల్డింగ్ అద్దె కూడా బకాయిలు ఉన్నట్లు తెలిసింది. భారీ మొత్తంలో అద్దె బకాయిలు ఉండడంతో మరమ్మతులు చేయించేందుకు భవన యజమానులు ముందుకు రావడం లేదని తెలిసింది.



విరిగిపోయిన కిటికీ



ఆవరణ శుభ్రం చేస్తున్న విద్యార్థులు

సమస్యలకు నిలయాలు

- సిరిసిల్లలోని బీసీ ప్రిమెట్రిక్ హాస్టల్‌లో స్లాబ్ పెచ్చులు ఊడిపడి ఒక విద్యార్థి గాయపడ్డారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో భవనం ఉరుస్తుంది. విద్యార్థి సంఘాల ఆందోళనతో మున్సిపల్ ప్లానింగ్ విభాగం అధికారులు ఇటీవల తనిఖీలు చేసి, మరమ్మతులు చేయిస్తున్నారు.
- జిల్లాలోని దాదాపు అన్ని వసతిగృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గాలి, వెలుతురు సరిగ్గా రాని భవనాలే ఎక్కువగా ఉన్నాయి. లక్షలాది రూపాయల అద్దె బకాయిలు ఉండడంతో భవన యజమానులు సహకరించడం లేదని సహాయ సంక్షేమాధికారి సంపూర్ణ తెలిపారు.

స్థానికంగా ఉండని వార్డెన్లు

సంక్షేమశాఖ పరిధిలో నిర్వహిస్తున్న చాలా హాస్టళ్ల వార్డెన్లు స్థానికంగా ఉండడం లేదు. వేములవాడ ప్రీమెట్రిక్ హాస్టల్ వార్డెన్ గంగయ్య, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణ స్థానికంగా ఉండడం లేదు. సిరిసిల్ల కొత్తబస్టాండ్‌లో సమీపంలోని పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వార్డెన్ రాజశేఖర్ కూడా స్థానికుడు కాదు. వీరంతా కరీంనగర్‌లో ఉంటూ నిత్యం వచ్చి వెళ్తున్నారు. దీంతో పిల్లల ఆలనా పాలనా వంటమనుషులు చూసుకుంటున్నారు.

విన్నపాలు వినవలే..

- బారులుతీరిన బాధితులు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో పలువురు బాధితులు కలెక్టరేట్‌లోని ప్రజావాణికి బారులుతీరుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధికారులను వేడుకుంటున్నారు. సోమవారం పలువురు నుంచి అర్జీలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్వీకరించారు. వివిధ సమస్యలపై 34 అర్జీలు వచ్చాయి. సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, పలు శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

ముంపుగ్రామాల సమస్యలు పరిష్కరించండి



మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి. పద్దెనిమిదేళ్లు నిండిన వారికి పట్టా, ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. గ్రామాల సరిహద్దులు ఏర్పాటు చేయకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయన్నారు. భూనిర్వాసితులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

– చొక్కాల రాము, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు

కాలువలను కాపాడండి



సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని చెరువులకు సంబంధించిన కాలువలు పూడ్చివేతకు గురవుతున్నాయి. కొత్తచెరువు, కొత్తకుంట, భామనికుంట, మైసమ్మకుంట చెరువులకు సంబంధించిన కాలువలను పూడ్చివేస్తున్నారు. అధికారులు పట్టించుకోవాలి.

– పెద్దూరు గ్రామస్తులు

ఉపాధి కల్పించండి



నేను అంగవైకల్యంతోనే జన్మించాను. డిగ్రీ వరకు చదువుకున్నాను. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఏదైన ఉద్యోగం, ఉపాధి చూపించాలి. చాలా సార్లు ప్రజావాణికి వచ్చి దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. అధికారులు స్పందించి ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– కాసర్ల గణేష్, కోనరావుపేట

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వండి



అర్హులైన ట్రాన్స్‌జెండర్స్‌కి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయండి. ఆసరా పెన్షన్, విద్య, ఉద్యోగం, ఉపాధిలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి.

– ట్రాన్స్‌జెండర్స్

విద్యారంగంలో అగ్రస్థానంలో నిలపాలి

- డీఈవో రమేశ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధన పద్ధతులు అవలంబిస్తూ రాష్ట్రంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని గీతానగర్ స్కూల్‌లో ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్‌ఎల్‌ఎన్) తొలిమెట్టు శిక్షణలో భాగంగా మండల రిసోర్స్ పర్సన్లకు మూడు రోజుల శిక్షణను సోమవారం ప్రారంభించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులలో ఎఫ్ఎల్ఎల్ కార్యక్రమం గతేడాది విజయవంతంగా నిర్వహించామని, ఈ సంవత్సరం పూర్తి లక్ష్యాలను చేరుకునేలా కృషిచేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు శైలజ, పద్మజ, సాగర్, జిల్లా రిసోర్స్‌పర్సన్లు రమానాథ్ రెడ్డి, రవీందర్, శర్మ, నరేశ్, భాస్కర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సరైన సమయంలో టీకాలివ్వాలి

- జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు



డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో వైద్యసిబ్బందికి శిక్షణ

సిరిసిల్లటౌన్: నవజాత శిశువులు, గర్భిణులకు సరైన సమయంలో టీకాలు ఇవ్వాలని వైద్యసిబ్బందికి డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు సూచించారు. కాలానుగుణంగా టీకాలు ఇచ్చేందుకు యూ–విన్ ప్లాట్‌ఫామ్ కార్యక్రమం ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన శిక్షణను సోమవారం ఇచ్చిన సందర్భంగా మాట్లాడారు. గర్భిణులు, నవజాత శిశువుల వివరాలు డిజిటలైజేషన్ చేయాలన్నారు. డాక్టర్ అతుల్ పి.నగీమ్ మాట్లాడుతూ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ మూడు రౌండ్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూరుశాతం వ్యాక్సినేషన్ పూర్తయ్యేలా కార్యాచరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వైద్యాధికారి ఎం.మహేశ్, డీడీఎం కార్తీక్, హెచ్ఈవో సంపత్, బాలయ్య, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వట్లేదు

- మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్
- సిరిసిల్ల అమరవీరుల స్తూపం వద్ద ధర్నా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

సిరిసిల్లటౌన్: అర్హులైన పేదలకు ఇప్పటికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదని.. ఇచ్చిన వాటిలోనూ బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. నిరుపేదల సొంతింటి కోసం ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి ప్రధాని ఆవాస్ యోజన కింద రూ.17 వేల కోట్లు అందించారని తెలిపారు. సిరిసిల్ల పాత బస్టాండులోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన నిధులతో ఇతర రాష్ట్రాల్లో లక్షలాది ఇళ్లు కట్టించి పేదలకు ఇవ్వగా.. రాష్ట్రంలో మాత్రం బీఆర్ఎస్ సర్కారు రాజకీయకక్షలతో పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడం లేదన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని కోరారు. తండ్రీకొడుకులు కలిసి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ పోరాటంతోనే రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వచ్చాయని గుర్తు చేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు ఎర్రం మహేశ్, మట్ట వెంకటేశ్వర్ రెడ్డి,ఆవునూరి రమాకాంత్‌రావు, రెడ్డబోయిన గోపి, ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, శీలం రాజు, బర్కం లక్ష్మీయాదవ్, గర్రి పెల్లి ప్రభాకర్, బూర విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సీఐల నియామకం

- వేములవాడ టౌన్ సీఐగా కరుణాకర్
- వేములవాడ రూరల్ సీఐగా కృష్ణకుమార్



సీఐ కృష్ణకుమార్

సిరిసిల్లక్రైం: వేములవాడ టౌన్, వేములవాడ రూరల్ సీఐ పోస్టులకు ఇద్దరు సీఐలను కేటాయిస్తూ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న పెరుక కరుణాకర్‌ను వేములవాడ టౌన్ సీఐగా బదిలీ చేయగా, సిరిసిల్ల డీసీఆర్బీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న కృష్ణకుమార్‌ను వేములవాడరూరల్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సిరిసిల్ల సీసీఎస్‌కు కరీంనగర్ కమిషనరేట్‌లో ఉన్న సీఐ కట్ల రవీందర్‌ను బదిలీ చేశారు.



సీఐ కరుణాకర్‌కు ప్రసాదాలు అందజేస్తున్న సిబ్బంది

రాజన్న సేవలో టౌన్ సీఐ కరుణాకర్

వేములవాడ: వేములవాడ రాజన్నను టౌన్ సీఐ కరుణాకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. నాగిరెడ్డి మండపంలో పర్యవేక్షకులు శ్రీరాములు ప్రసాదాలు అందించారు.



పే...ద్ద చేప

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లికి చెందిన మత్స్యకారుడు ఇటికల దేవరాజు వలకు సోమవారం భారీ చేప చిక్కింది. ఆదివారం సాయంత్రం మిడ్‌మానేరు వాటర్‌లోకి చేపల వేటకు వెళ్లగా 20 కిలోల చేప చిక్కింది.

హ్యాపీ బర్త్‌డే కేటీఆర్

- జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు
- విద్యార్థులకు ఉచిత బస్సుపాస్‌లు అందజేత
- జిల్లా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ



సిరిసిల్లలో కేక్ కట్ చేసి, బెలూన్లు ఎగురవేస్తున్న నాయకులు



వేములవాడలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: రాష్ట్ర పురపాలక, ఐటీశాఖల మంత్రి కె.తారకరామారావు జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌరస్తాలో కేక్ కట్ చేసి, బెలూన్లు ఎగురవేశారు. 'హ్యాపీ బర్త్ డే కేటీఆర్' అనే అక్షరాలతో విద్యార్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ బీసీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి బొల్లి రామ్మోహన్, చీటి నర్సింగరావు చేతుల మీదుగా ప్రభుత్వ పాఠశాల పిల్లలు 100 మందికి ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో 47 కిలోల కేక్ కోశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, గడ్డం నర్సయ్య, కౌన్సిలర్లు జాగీరు శైలు, దార్ల సందీప్, శివంగాలపల్లి సర్పంచ్ సురేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడలో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజన్న గుడి ఎదుట 48 కిలోల కేక్‌ను కట్ చేశారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ గొప్ప ఉద్యమనేత, దేశంలోనే గుణాత్మక మార్పునకు కృషి చేస్తున్న యువ నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ బూర వజ్రమ్మ, గంగం స్వరూప, బైరగోని లావణ్య, చంద్రయ్యగౌడ్, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, మ్యాకల రవి, ఏఎంసీ చైర్మన్లు ఏనుగుల శ్రీనివాస్, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి, సెస్ డైరెక్టర్లు ఆకుల దేవరాజం, నామాల ఉమ, చరణ్‌రావు, గంగారాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఏఎస్సై

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని జైసేవాలాల్ ఊరుతండాకు చెందిన గుగులోత్ కిశోర్ జూన్ 28న నిమ్మపల్లి నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా సెల్‌ఫోన్ ఎక్కడో పడిపోయింది. వెంటనే కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ అప్లికేషన్‌లో వివరాలు నమోదు చేసి సెల్‌ఫోన్‌ను వెతికి సోమవారం అందజేసినట్లు ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు



వర్షానికి కూలిన ఇల్లు

రుద్రంగి(వేములవాడ): ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రానికి చెందిన చిన్నమల్లయ్య ఇల్లు ఆదివారం రాత్రి కూలింది. ఇంటిలోని నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. ప్రభుత్వ ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం నాయకులు

చందుర్తి(వేములవాడ): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ కోరారు. మండలంలోని సనుగుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ గడువు 2023తో ముగుస్తుండగా, మధ్యంతర భృతి ఐఆర్ ఇచ్చి పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవర్ధన్, మండల అసోసియేట్ అధ్యక్షులు లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట ఎస్సై హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్?

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట ఎస్సై కె.రాజేశ్‌ను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పాత్తూరుకు చెందిన దళిత యువకులు ర్యాగటి అజయ్, తోడేటి అరవింద్‌లను ఎస్సై కొట్టడంతోపాటు చిత్రహింసలు పెట్టారనే ఆరోపణలపై దళిత సంఘాల నాయకులు గత ఐదు రోజులుగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్పీ అఖిల్‌మహాజన్ ఎస్సైని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారని స్థానికంగా చర్చ సాగుతుంది.

అధ్వానంగా అంతర్గత రహదారులు

- గుంతలమయ రోడ్లతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న ధ్వంసమైన సీసీ రోడ్డు మహాలక్ష్మి కాలనీలోనిది. కొన్నేళ్ల క్రితం చేపట్టిన సీసీరోడ్డు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. త్వరగా సీసీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మట్టి రోడ్డు మండలకేంద్రంలోని లింగంపేట పల్లె తెనుగు కాలనీలోనిది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి నడవడానికి వీలు లేకుండా తయారైంది. ఈ దారి గుండా వెళ్లేందుకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. తొందరగా మరమ్మతు చేపట్టి సీసీరోడ్డు వేయాలని వారు కోరుతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు చందుర్తి మండలం లింగంపేట ఆమ్లెట్ విలేజ్ కొత్తపేట, కథలాపూర్ మండలం తుర్తి గ్రామాలకు వెళ్లే ప్రధాన దారి. మట్టిరోడ్డు కావడంతో వర్షాలకు రోడ్డంతా చిత్తడిగా మారింది. మోకాలు లోతు గుంతలు పడి ప్రయాణం నరకంగా మారిందని రుద్రంగి, కొత్తపేట, తుర్తి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా బీటీరోడ్డు వేయాలని వారు కోరుతున్నారు.

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలోని చాలా కాలనీల్లో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని మండల కేంద్రంలోని ప్రజలు వాపోతున్నారు. కొన్ని చోట్ల మట్టిరోడ్లు కొట్టుకుపోయి నడవడానికి వీలు లేకుండా ఉంటే, మరికొన్ని చోట్ల సీసీరోడ్లు వేసిన కొన్నేళ్లకే పూర్తిగా ధ్వంసమై ఇబ్బందులు పడుతున్నామని తెలుపుతున్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా అంతర్గత దారులకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు కలుగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



సీసీరోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతు పనులు చేపట్టాలని రెండునెలల క్రితం ఫిర్యాదు చేశా. ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ నీరు రోడ్లపైనే పారుతూ కంపు కొడుతోంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి

– దేశవేని వినోద్, రుద్రంగి

ఇబ్బంది పడుతున్నాం



మట్టిరోడ్డు మొత్తం గుంతలుగా ఉండేది. వర్షాలకు రోడ్డంతా కోసుకుపోయి మోకాలు లోతు గోతిపడింది. నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయంగా ఉంది. రోడ్డును త్వరగా బాగుచేయాలి

– నేవూరి గంగవ్వ, వృద్ధురాలు లింగంపేట తెనుగు పల్లె, రుద్రంగి

నిధులు మంజూరు కాగానే ప్రారంభిస్తాం



ధ్వంసమైన సీసీరోడ్లకు మరమ్మతు పనులు చేపట్టేందుకు నిధులు లేవు. నిధులు మంజూరుకాగానే సీసీరోడ్డు వేస్తాం. ఇక మట్టిరోడ్లతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా సీసీరోడ్లు వేస్తాం.

– మనోహర్, పీఆర్ఏఈ, రుద్రంగి.

కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మన్నాన్



మన్నాన్‌ను సన్మానిస్తున్న అతిథులు

వేములవాడ: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కాయ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వేములవాడకు చెందిన ఎంఏ మన్నాన్‌ను ఎన్నుకున్నారు. కరీంనగర్‌లో ఈనెల 23న జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్ ఏకగ్రీవంగా మన్నాన్ ఎన్నికైనట్లు తెలిపారు. తనను నియమించినందుకు మన్నాన్ రాష్ట్ర కరాటే అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కరాటే అసోసియేషన్ కన్వీనర్ చల్ల హరిశంకర్, వసంత్‌కుమార్, జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కొండ దేవయ్య, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో గల మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ గౌతంరెడ్డి తెలిపారు. కళాశాలలో సీట్లు కావాలిసిన వారు ఉదయం 11 గంటలకు ఆయా కళాశాలలోని ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సీట్లు పొందాలని సూచించారు. అభ్యర్థులు ఆదాయం, కులం, ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్‌లతో హాజరు కావాలన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



విజేతలతో పోటీల నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్: రెండు రోజులుగా కరీంనగర్‌లోని జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తున్న ఉత్తర తెలంగాణ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 350 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శరత్‌కుమార్ రెడ్డి హాజరై, విజేతలకు బహుమతి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కరీంనగర్‌లో మొట్టమొదటిసారి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. పోటీల కో–ఆర్డినేటర్ మద్దెల వికాస్ మాట్లాడుతూ.. జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ గౌతమ్ రెడ్డి, పోటీల నిర్వాహకులు ఎస్.సురేందర్ సింగ్, కంకట అనూప్, ఆర్.నరేశ్, పి.సత్యనారాయణ, శ్రీధర్, ఉపేందర్ కౌర్, ఎం.సంతోష్, జి.హర్షమణి, రాకేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–13 బాలుర విభాగంలో పి.జయంత్, చార్విక్(ఖమ్మం), ఎస్కే.దిల్షాన్(కరీంనగర్), బాలికల విభాగంలో అవనిరెడ్డి(కరీంనగర్), ఎస్.శివాని (ఖమ్మం), సత్య చతుర్వేది(మంచిర్యాల) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–16 బాలుర విభాగంలో జ్వలిత్(ఖమ్మం), పి.అజయ్(కరీంనగర్), డి.గణేశ్(నిజామాబాద్), బాలికల విభాగంలో జి.సిరి(ఖమ్మం), వై.అన్విరెడ్డి(కరీంనగర్), సత్య చతుర్వేది(మంచిర్యాల), అండర్–19 బాలుర విభాగంలో ఎస్.జత్సింగ్, సాయితేజ, పి.అజయ్(కరీంనగర్), బాలికల విభాగంలో ఎం.అభిజ్ఞ(కరీంనగర్), ఎం.ధరణి(ఖమ్మం), వి.సిరి(ఖమ్మం), పురుషుల సింగిల్స్ విభాగంలో లోకేశ్(కొత్తగూడెం), సంతోష్(కరీంనగర్), శశికుమార్(ఖమ్మం), డబుల్స్ విభాగంలో రియాజ్ షేక్, లోకేశ్(కొత్తగూడెం), సంతోష్, పర్శురాం(కరీంనగర్), రవి, రమేశ్(వరంగల్), మహిళల సింగిల్స్ విభాగంలో ఎ.తన్మయి(వరంగల్), ఆర్.ప్రీతి(నిజామాబాద్), ఎం.అభిజ్ఞ(కరీంనగర్), డబుల్స్ విభాగంలో ప్రీతి, శ్వేత (నిజామాబాద్), అన్విరెడ్డి, ఎం.అభిజ్ఞ(కరీంనగర్), సింధు, శ్రావ్య(కరీంనగర్) మొదటి మూడు స్థానాలు సాధించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ: పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని చెక్కపల్లి రోడ్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. భవిష్యత్ తరాల కోసం ఇంటింటా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అన్వేష్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది, వార్డు ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా అధ్యక్షుడు రమేశ్



ఎల్లారెడ్డిపేటలో ర్యాలీ తీస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఎనుగంటి మూషం రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 19వ రోజుకు చేరింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు మద్దతుగా ఉంటామన్నారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు రేసు రాజయ్య, మండల అధ్యక్షులు జక్కుల మహేందర్, కార్మికులు భారతవ్వ, నర్సయ్య, రాందాస్, నర్సయ్య, రాములు, రాజయ్య, మైసయ్య, రామవ్వ, లింగవ్వ, రాములు, లక్ష్మీ, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సత్వర సహాయానికి గ్రీవెన్స్ డే

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదుదారులకు సత్వర సహాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 26 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. సివిల్ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులకు న్యాయపరంగా సలహాలు, సూచనలు అందించినట్లు వివరించారు.

పలువురు ఏసీపీల బదిలీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా కె.గిరికుమార్, కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా ఉన్న జె.విజయసారథిని డీజీపీ కార్యాలయానికి, వి.మాధవిని కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా, కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా ఉన్న కె.శ్రీనివాస్‌ను డీజీపీ కార్యాలయానికి, టి.మల్లారెడ్డిని రామగుండం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా, జి.వెంకటేశ్వర బాబును జగిత్యాల సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేశారు.

కోతకు గురైన పెంటివాగు రోడ్డు



కొండాపూర్ శివారులో కోతకు గురైన పెంటివాగు రోడ్డు

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్ శివారులో పెంటివాగు వద్ద ఆదివారం పోసిన మట్టి ఒక్కరోజుకే కొట్టుకుపోయింది. సిరిసిల్ల –కోనరావుపేట ప్రధాన రహదారిలో కొండాపూర్ గ్రామ శివారులో పెంటివాగు వంతెన కొట్టుకుపోయింది. పది రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు కోనరావుపేట మీదుగా వెళ్తున్నాయి. దీంతో సర్పంచ్ మల్యాల దేవయ్య కొట్టుకుపోయిన వంతెన వద్ద మట్టిని పోయించారు. రహదారి సమస్య తీరిందని అనుకున్న తరుణంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో రవాణా సమస్య మళ్లీ అలాగే తయారైంది.

సమాజ హితం కోరేదే అసలైన కవిత్వం



'మధు కవనం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కిషన్‌రావు

కరీంనగర్‌కల్చరల్: భాష ఏదైన కవితాక్షరాలు సమాజ హితాన్ని కోరుతూ జాతిని జాగృత పరుస్తాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి రచించిన మధు కవనం గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మధు కవనం కవితా సంపుటిలో గ్రామీణ వాతావరణం బడుగుల బతుకు వెతలు, యువ చైతన్య అంశాలనే కవితా వస్తువులుగా చేసుకొని పామరులకు సహితం అర్థమయ్యేలా కవితలు పండించారని కొనియాడారు. వృతిరీత్యా రసాయనశాస్త్ర ఆచార్యులు అయినప్పటికీ తన గ్రామీణ నేపథ్యాన్ని ఆసరాగా చేసుకొని పలు కవితలు అక్షరీకరించడం ముదావహం అన్నారు. రచయిత, కవి, కాలమిస్టు బుర్ర మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మన తీపి చేదు జీవన అనుభవాలను పునాదులుగా చేసుకొని సమాజ అవలక్షణాలు, సుగుణాలను తనదైన శైలిలో కవితాక్షరాల రూపంలో కవితలు రాయడం జరిగిందన్నారు. విశిష్ట అతిథులు ప్రముఖ సాహితీ దిగ్గజం దాస్యం సేనాధిపతి, నేటినిజం పత్రిక సంపాదకులు బైసా దేవదాసులు మాట్లాడుతూ వస్తు ఎంపికలో వైవిధ్యాన్ని పాటిస్తూ బుర్ర మధుసూదన్‌రెడ్డి కవిగా శిల్పంలో చతురత ప్రదర్శించారని అన్నారు. ఆత్మీయ అతిథి సాహితీవేత్త మచ్చ హరిదాసు మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి కవిత్వంతో పాటు కాలమిస్టుగా నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పేరును పొందడం సంతోషదాయకమన్నారు. మచ్చ హరిదాసు రచించిన మచ్చ వీరయ్య భక్తితత్వ ప్రకాశిక గ్రంథాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి ఐనంపూడి శ్రీలక్ష్మి, హాంకాంగ్ తెలుగు సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పీచపాటి జయ, విశ్రాంత డీఈవో అనభేరి రాజేశ్వర్‌రావు, కవి బొమ్మకంటి కిషన్, దయాకర్, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం

- ప్రజావాణికి పురుగుల మందు డబ్బాలతో వచ్చిన బాధితులు



పురుగుమందు డబ్బాతో హాజరైన రైతు



బాధితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సిరిసిల్లఅర్బన్: రోజులకొద్దీ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. తమకు ఆత్మహత్యే శరణ్యమంటూ ఇద్దరు బాధితులు సోమవారం రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. తమ సమస్య పరిష్కరించకుంటే చావే దిక్కంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన కరెడ్ల రాజిరెడ్డికి వారసత్వంగా వచ్చిన 37 గుంటల భూమి ఉంది. ఆ భూమిపై మార్టిగేజ్ రుణం తీసుకొని చెల్లించాడు. భూమి పత్రాలు ఇవ్వాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విసిగివేసారిపోయిన రైతు రాజిరెడ్డి ప్రజావాణికి క్రిమిసంహారక మందుడబ్బాతో రాగా పోలీసులు అడ్డుకునే యత్నం చేశారు. గమనించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగంలోకి తీసుకోండి..

వేములవాడకు చెందిన మహమ్మద్ అజామ్‌షరీఫ్ ఆదిలాబాద్ జిల్లాలో డీఆర్‌డీఏలో పన్నెండేళ్లు పనిచేసి అనారోగ్య సమస్యతో మానివేశాడు. అయితే మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆరేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ప్రజావాణికి పురుగుల మందు డబ్బాతో రాగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అధ్యాపకులు

సిరిసిల్ల కల్చరల్: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) విద్యార్థులను కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అభినందించారు. గతేడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించిన విద్యార్థులతో సహా కళాశాల అధ్యాపకులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్, అధ్యాపకులు బుర్ర వెంకటేశం, అరుంధతి, కనకయ్య, సురేశ్, ఆంజనేయులు, వివేక్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.